


## గజరాజు మృతి



కల్లూరు, జూలై 5 ప్రభాతవార్త:
పులిచెర్ల మండలం పాతపేట పంచాయితీ పూరేడు వారి పల్లి చెరువు సమీపంలో శనివారం ఉదయం ఏనుగు మృతి చెందింది. మండలంలో గత మూడు నెలలుగా ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక ఆడ ఏనుగు చెరువు వద్ద మృతి చెంది ఉండడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. జిల్లా అటవీశాఖ అధికారిణి ధరణి సంఘటనా స్థలానికి చేరుకొని ఏనుగు మృతిపై విషయాలను సేకరించారు. తిరుపతి జూపార్క్ వైద్యులు ఏనుగుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారిణి ధరణి మాట్లాడుతూ మామిడి కాయలు ఎక్కువగా తినడం వల్లనే ఈ సంఘటన జరిగిందని, పోస్టుమార్టం రిపోర్టు అనంతరం పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. పులిచెర్ల తాసిల్దార్ జయసింహ, అటవీశాఖ అధికారులు, సర్పంచ్ నటరాజ, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాసు లోకేష్, వీఆర్వోలు శకుంతల, మౌనిక తదితరులు పర్యవేక్షించారు. సమీప గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటన స్థలాన్ని చేరుకుని ఏనుగును చూశారు.

## తిరుచ్చి వాహనంపై "దేవేరులతో కల్యాణ వెంకన్న"



చంద్రగిరి, జూలై 5 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

### మామిడి ప్రాసెసింగ్ యూనిట్లకు

# అన్ని విధాలుగా మద్దతు

**రైతుల నుండి మామిడిని కనీస ధరకు కొనుగోలు**

**రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, కలెక్టర్ సుమిత్‌కుమార్**



ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులతో సమావేశమైన ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్‌లు

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
మామిడి ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దుతు ఇస్తోందని, ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల నుండి మామిడిని కనీస ధరకు రైతుల నుండి కొనుగోలు చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మాట్లాడుతూ మామిడి రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతున్నదన్నారు. రానున్న బడ్జెట్‌లో మ్యాంగో బోర్డును చిత్తూరులో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేయడం జరిగిందన్నారు. పల్ప్ ప్రాసెసింగ్‌లో 8 కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయడానికి ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. అలాగే ప్రాసెసింగ్ యూనిట్లుకి సైతం మామిడి ప్రాసెసింగ్ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఇప్పటికే సిఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారన్నారు. మామిడి రైతుల సమస్యల సంక్షోభ నివారణకు మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు ముందుకు రావాలన్నారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల ఉత్పత్తులను పెద్ద ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాల్లో కొని పంపిణీ చేసేలా ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు తమ మార్కెట్ విస్తరణకు పూనుకోవాలన్నారు. సమావేశంలో జెసి జి.విద్యాధరి, ఎండి శేఖర్, హార్టికల్చర్ డిడి మధుసూధన్‌రెడ్డి, ఫుడ్ అండ్ ఇన్స్ సిద్ధార్థ్, అగ్రో సువేరా మంజునాథ, తదితర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు పాల్గొన్నారు.

## కల్యాణకట్టలో గుండుగీసుకుంటే

**-స్నానపుహాల్‌లో పనిచేయని గీజర్లు !**

**-నాలుగు నిరుపయోగమైనా పర్యవేక్షణ ఏదీ!?**

# వేడినీళ్లు కరువే!



తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వస్తున్న 90వేలమంది భక్తుల్లో 30వేలమంది భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. ఇలా ప్రధాన కల్యాణకట్టకు చేరుకుని తలనీలాలు సమర్పించిన భక్తులు వేడినీటితో స్నానం చేసేందుకు వీలుగా తిరుమలలో విశాల మైన హాళ్ళలో గీజర్లు ఏర్పాటుచేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆరు గీజర్లు ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా వీటిలో నాలుగు గీజర్లు పనిచేయడంలేదు. ఉన్న రెండు గీజర్లు వేడినీళ్ళు కూడా సరిగా రావడం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ ప్రధాన కల్యాణకట్టలో పరిస్థితి. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి, వారిలో సంతోషం చూడాలనే ఉన్నత అధికారులు టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చూపుతున్న శ్రద్ధకు తగ్గట్లు క్రిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించింది. కల్యాణకట్ట నిర్వహణ బాధ్యతలు ప్రత్యేకంగా ఓ డిప్యూటీ ఈఓ అధికారి ఆయన క్రింద ఏఈఓలు, సూపర్‌వైజర్లు ,మేస్త్రీలు ఉంటారు. అయితే కల్యాణకట్టలో గీజర్లు పనిచేస్తున్నాయా లేదా అని రోజువారీగా తనిఖీ చేయాల్సి ఉంది. ఇవేమీ పట్టించుకోని కొందరు ఉద్యోగులు భక్తుల సేవలు ఎలా ఉన్నా అనేది గాలికొదిలేశారనేది విమర్శలు. ప్రధాన కల్యాణకట్టలోని స్నానపుగదుల హాళ్ళలో ఉన్న గీజర్లు రెండు కూడా అంతంతమాత్రంగానే పనిచేస్తున్నాయనేది భక్తుల ఆవేదన. రద్దీ పెరిగినా భక్తులకు సౌకర్యాలు,సేవలు అంతంతగానే ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. చల్లనినీటితో తలస్నానం చేయాలంటే ఉదయం వేళ ,మధ్యాహ్నం కూడా మారిన వాతావరణంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్యాణకట్టలో గీజర్లు పూర్తిస్థాయిలో పనిచేసి భక్తులకు వేడినీళ్ళు అందించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

### లోక్ అదాలత్ ద్వారా

# ఉచిత సత్వర సమన్యాయం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక**



చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కక్షిదారులకు ఉచిత సత్వర సమన్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాల్ కార్యక్రమంను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సత్వర సమ న్యాయం అందించడానికి చిత్తూరు జిల్లా కోర్టుతో పాటు తిరుపతి, మదనపల్లి, శ్రీకాళహస్తి, పీలేరు, పుత్తూరు, పుంగనూరు, పలమనేరు, పాకాల, కుప్పం, వాల్మీకిపురం, సత్యవేడు, నగరి, తంబళ్ళపల్లెల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 8,861 కేసులను గుర్తించడం జరిగిందని, ఇందులో సివిల్, క్రిమినల్ కేసులు 5,678, ప్రీ లిటిగేషన్ కేసులు 3,183 వున్నాయని, ఈ కేసుల పరిష్కారంలో భాగంగా ఇప్పటి వరకు 80 సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, ఇన్సురెన్స్ కంపెనీలు, బ్యాంకులు, రెవెన్యూశాఖ, కార్మికశాఖ, మున్సిపల్ శాఖ, చిట్ ఫండ్ సంస్థలు, విద్యుత్, బిఎస్ఎన్ఎల్ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.




# ఘోర రోడ్డుప్రమాదం

**యువతి మృతి.. 15 మందికి గాయాలు**



.రేణిగుంట జూలై 5 ప్రభాతవార్త
రేణిగుంట మండలం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రిగుంట సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడకక్కడే మృతిచెందగా, 15 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం దగ్గరలోని అమర ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా కరకంబాడి లోని ఓ ప్రైవేట్ కర్మాగారానికి ఉదయం పిచ్చాటూరు నుండి కార్మికులను, ఉద్యోగులను తీసుకెళ్లే కంపెనీ బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు కూర్చున్న ఊహ మహాలక్ష్మి అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. 15 మంది గాయపడ్డారు.విషయం తెలుసుకున్న వెంటనే రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకొని ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అమర ఆసుపత్రికి తరలించారు. అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందిస్తాల్సిందిగా వైద్యులను కోరారు. ప్రమాద విషయం పై సిఐటియు నేతలు సెల్వరాజ్, ఈశ్వరి తదితరులు స్పందిస్తూ మృతురాలి కుటుంబానికి కోటి రూపాయలు, గాయపడిన వారికి 50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాన్ని విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

# భవిష్యత్ తరాలకు దిక్సూచి చంద్రబాబు: ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, జులై 5 ప్రభాతవార్త:
రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనించాలంటే భవిష్యత్ తరాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిక్సూచి లాంటివారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఉగ్గుముడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని పూడ్చుకుని తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. ఆర్థికపరంగా వెనుకబడి ఉన్నప్పటికీ ప్రజలకు రూ.4 వేలు పింఛన్, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, రైతుభరోసా వంటి పథకాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ఇంకా మెరుగైన మౌలిక సదుపాయాలు ఎలా కల్పించాలనే ఆలోచనతోనే ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళుతున్నట్లు తెలిపారు. అలాగే సూళ్లూరుపేట మండలం నాదెం డ్లవారి కండ్రిగ గ్రామ పంచాయతీలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ పరిశీలకులు జడ్.శివప్రసాద్, టిడిపి నేతలు కొక్కు శంకరయ్య, తాటిపర్తి శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, జక్కల బాలయ్య, దువ్వూరు మురళీరెడ్డి, తహశీల్దార్ పి.గోపీనాథ్‌రెడ్డి, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆబాక రమేష్‌రెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అలిపిరి టోల్‌గేట్ విస్తరణ!

**-సమీక్షలో టిటిడి ఈఓ శ్యామలరావు**



తిరుమల,జూలై 5ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యతోబాటు వాహనాలు పెరిగిపోతుండటంతో వేగంగా తనిఖీలు చేయడానికి అలిపిరి టోల్‌గేట్ విస్తరించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. ఇక్కడ టోల్‌గేట్ విస్తరణలో భాగంగా చెకింగ్ పాయింట్లు, లగేజీ తనిఖీ స్కానింగ్ యంత్రాలు,సెక్యూరిటీ పెంచే అంశాలపై టిటిడి ఐటి విభాగం, ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,ఎఫ్ఎసిఏఓ బాలాజీ,డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు ఇతర అధికారులతో కలసి ఈఓ శ్యామలరావు టిటిడిలో అభివృద్ధి పనులపై, టోల్‌గేట్ విస్తరణపై సమీక్షించారు. అలిపిరిలో వాహనాల తనిఖీలు, లగేజీ స్కానింగ్ పరికరాలు అత్యాధునికంగా ఏర్పాటుచేయాలని, విమానాశ్రయం తరహాలో తనిఖీలు పర్యవేక్షించాలని ఈఓ సూచించారు. మార్కెటింగ్ గోడౌన్‌లో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

# అలుగు కుంభాగ్రాన ప్రతిష్ట



అలుగును కుంభాగ్రాన నిలిపిన దృశ్యం

శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త

**వైష్ణవ కోనేరు నుంచి నీటి సేకరణ**

ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆలయంలోని గర్భగుడిలో మహిమాన్విత మైన అలుగును కుంభాగ్రాన నిలిపే కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పూజారులు ఎంతో నియమ నిష్టలతో భక్తిశ్రద్దలతో కుండపై కత్తిని నిలబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,ఎఇఓ హేమామాలిని, సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

**వైష్ణవ కోనేరు నుంచి కలశాల నీటి సేకరణ:**
పురాతన కాలం నుంచి ఇక్కడి ద్రౌపదీసమేత ధర్మరాజుల ఉత్సవాల సందర్భంగా భారత పఠనంలో ఉత్తర గోగ్రహణం రోజు వైష్ణవ కోనేరు నుంచి నీటిని కలశాల్లో తీసుకొని ఆలయం వద్దకు చేరి అక్కడి మూల విరాట్టులకు అభిషేకం చేయటం ఆనవాయితిగా వస్తుందని పెద్దలు చెబుతారు.ఈ మేరకు శనివారం ఉదయం మేళ తాళాలు పంబజోళ్ళ మోతతో నిర్వాహక పూజారులు శాస్త్రోక్తంగా కోనేరున ఉంచి నీటినితీసుకొని వెళ్ళారు.

**నేడు అగ్నిగుండ ప్రవేశం:**
ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం ఆలయం వద్ద దుర్యోధన, దుశ్శాసన వధ, అగ్నిగుండ ప్రవేశం, పొంగళ్ళు పెట్టుకునే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయం వద్ద భారీ బందోబస్తు మధ్య ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే వేలాది మంది కంకణాలు ధరించారు. ఆదివారం సాయంత్రానికి కనీసం 6నుంచి 7వేల మంది అగ్నిగుండం ప్రవేశం చేయవచ్చునని భావిస్తున్నారు.


## ది చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, చిత్తూరు.



(రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ)
(Fully computerised CBS Bank)
RBI Licence No. RPCD (H) Coop/18/05.08.03/2011-12 Dt. 28/11/2012

**ప్రతిరోజు బంగారు నగలపై ఋణ సదుపాయం కలదు**
మరియు
**సహకార బ్యాంకులో పొదుపు చేయండి - అధిక వడ్డీ పొందండి**

**డిపాజిట్ల పై వడ్డీ రేటు**

| కాల పరిమితి | వడ్డీ రేటు |
|---|---|
| సేవింగ్స్ ఖాతాలకు | 4.00% |
| 7 రోజుల నుండి 14 రోజుల వరకు (లక్షకు పైబడి) | 4.75% |
| 15 రోజుల నుండి 45 రోజుల వరకు | 5.00% |
| 46 రోజుల నుండి 90 రోజుల వరకు | 5.25% |
| 91 రోజుల నుండి 179 రోజుల వరకు | 5.75% |
| 180 రోజుల నుండి 1 సంవత్సరం లోపు | 6.50% |
| 1 సం॥ నుండి 2 సం॥ల లోపు | 7.80% |
| 2 సం॥ల నుండి 5 సం॥ల లోపు | 6.50% |
| 5 సం॥లకు పైబడిన | 6.25% |

- ప్రతి డిపాజిట్ ఖాతాకు డిపాజిట్ ఇన్సూరెన్సు గ్యారెంటీ మరియు నామినేషన్ సౌకర్యం కలదు.
- 60 సం॥లు పైబడిన పౌరులకు సీనియర్ సిటిజన్స్ పథకం క్రింద 1 సం॥ ఆపై పొదుపు చేసే డిపాజిట్లపై 0.50% అధిక వడ్డీ లభించును.
- స్వల్ప అద్దెతో సేఫ్ డిపాజిట్ లాకరు సౌకర్యం మా బ్రాంచిల నందు కలదు.
- రైతు సంక్షేమమే ధ్యేయంగా మన బ్యాంకు నందు వ్యవసాయ అవసరాల నిమిత్తం పంట ఋణాలు, పాడి రైతుకు, పౌల్ట్రీ రైతుకు, పట్టుపురుగుల రైతుకు దీర్ఘకాలిక ఋణాలు, వ్యాపార అవసరాలకు క్యాష్ క్రెడిట్ సదుపాయం, జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలలో గృహఋణాలు, ఇతర ఆస్తుల తనఖా పై ఋణాలు, బంగారం పై ఋణాలు, వాహన ఋణం, స్వయం సహాయక సంఘాలకు మరియు వివిధ అవసరాలకు ఋణ సదుపాయం అందిస్తోంది.
- సాంకేతికంగా అభివృద్ధి దిశలో ఖాతాదారులకు అన్ని బ్రాంచీల నందు RTGS, NEFT, IMPS, UPI (Googlepay, Phonepe, etc.,) వంటి వేగవంతమైన ఫండ్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యము, ATM ద్వారా తక్షణం నగదు పొందే సౌకర్యం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, DBT, APB, AEPSల ద్వారా ఆధునిక సాంకేతిక అవసరాలు తీర్చేదిగా బ్యాంకు తోడ్పాటునందిస్తోంది.

పూర్తి వివరములకు ... సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించండి.

# మోసాలను ప్రజలకు తెలపడం మన బాధ్యత :పెద్దిరెడ్డి

పలమనేరు,జూలై 5 ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వం ప్రజలకు,రైతులకు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలపడం వైకాపా నాయకులు,కార్యకర్తల బాధ్యతని మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు.శనివారం స్థానిక వైకాపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలలో ఇప్పటి వరకు 1శాతం హామీలను అమలు చేయలేదని విమర్శించారు.మామిడి రైతులు ధరలు లేక పంటలను రోడ్డుపై పారబోస్తుంటే ప్రభుత్వానికి ఆ విషయం పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు.మామిడి రైతులకు అండగా నిలవడానికై



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9న బంగారుపాళ్యం పర్యటించ నున్నారని తెలిపారు.ప్రతి వైకాపా నాయకులు,కార్యకర్తలు ఆ కార్యక్రమానికి హాజరై పర్యటన జయప్రదం చేయాలని కోరారు.పలమనేరు ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ మాట్లాడుతూ స్థానిక టిడిపి నాయకులు చెరువులు, వాగులు, వంకలు ఆక్రమించే పనిలో ఉన్నారని,ఇసుక,మట్టి అక్రమ రవాణాలు జోరుగా సాగుతున్నాయని విమర్శించారు.ఉచిత ఇసుక అన్న ప్రభుత్వం ఉచితంగా టిడిపి నాయకులు తరలించుకుంటు ప్రజలను దోచుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు,ఎంపి రెడ్డెప్ప,మాజీ ఎమ్మెల్యేలు డా.వెంకటేగౌడా, డా.సునీల్ కుమార్,మండల కన్వీనర్లు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

– పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



**కాణిపాకం, జులై 5 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను శనివారం కాణిపాకం గ్రామ పంచాయతీలో నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కాణిపాకం, అగరంపల్లి, అగరంపల్లి దళితవాడ తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఇప్పటికే 80 శాతం అమలు చేసిందన్నారు. ఎప్పటకప్పుడు ప్రజల సమస్యలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తూ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. అలాగే చిగరపల్లి పంచాయతీలో సైతం ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కాణిపాక ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల జడ్పీటిసీ సుచిత్ర, మాజీ జడ్పీటిసీ లత, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, బంగారుపాళ్యం ఎఎంసి ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, నాయకులు పూర్ణచంద్రరావు, మోహన్‌నాయుడు, హేమాద్రినాయుడులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి రైతులకు అండగా ఉంటుంది : ఎమ్మెల్యే

పెద్దపంజాణి,జూలై 5 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వ రైతుల పక్షపాతని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లె నందు శనివారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందిన సంక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మామిడి రైతులకు అండగా ఉంటుందని గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి దిగుబడి పెరిగిందన్నారు.ప్రభుత్వం ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కిలోకు రూ.4 సబ్సిడీని నేరుగా రైతులకు చెల్లిస్తోందని తెలిపారు.జిల్లాలో వైకాపా నాయకుల కంపెనీలు సిండికేట్‌గా మారి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని,జిల్లాలో రైతుల వద్ద నుండి రూ.3కి తీసుకుంటున్న పీఎల్ఆర్,సిజిఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీ ఎవరిదని ఆయన ప్రశ్నించారు.వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వారి నేతల కంపెనీలకు మద్దతు తెలపడానికా లేక రైతులకు మద్దతు తెలపడానికి జిల్లాకు వస్తున్నారా తెలవడంలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయ భాస్కర్ రెడ్డి,నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, శ్రీరాములు,సుధాకర్ రెడ్డి,రోజా రెడ్డి,నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రామక్రిష్ణ నియామకం



చిత్తూరురూరల్, జులై 5 ప్రభాతవార్త:
చిత్తూరు నగరం, నూతన కోర్టు ప్రాంగణంలో చిత్తూరు జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విఆర్ రామక్రిష్ణ, 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం.బాలాజీలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి నాయకులకు కృతజ్ఞ తలు తెలుపుతూ ప్రభుత్వం తరపున కోర్టులో కేసులను సమర్ధవంతంగా వాదించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా వీరి నియామకం పట్ల బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## 61 కేసులకు పరిష్కారం చూపిన లోక్ అదాలత్

పుంగనూరు, జులై 5 ప్రభాతవార్త :



స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్యతలకు అద్భుతమైన ఫలితాలకు అవకాశం ఇచ్చింది. సీనియర్ న్యాయ మూర్తి భారీ ఫస్ట్ షేక్ ఆధ్వర్యంలో సాగిన ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు న్యాయవాదుల చొరవ న్యాయమూర్తి సమయస్ఫూర్తి, కక్షిదారుల అనుకూలతత్వంతో ఏకబిగిన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంచి పురోగతి సాధించింది. గంటల వ్యవధిలో 42 క్రిమినల్ కేసులు, ఇరవై ఒక్క సివిల్ కేసులు పరిష్కరించడానికి చొరవచూపి న్యాయస్థానం ప్రశంసనీయమైన పాత్ర పోషించింది. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని కఠినమైన కేసులను పరిష్కరించడంలో లోక్ అదాలత్ విజయవంతమైంది. న్యాయస్థానంలోని సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ కార్యవర్గం కక్షిదారులు సంయుక్తంగా సాగించిన రాజీ మార్గంతోనే ఇన్ని కేసులు పరిష్కరించడానికి మార్గం సుగమమైంది.

## చిత్తూరులో తొలి టెస్ట్ ట్యూబ్ బేబీ జననం



**చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:** చిత్తూరులో తొలి టెస్ట్ ట్యూబ్ బేబీ పురుడు పోసుకుని చరిత్ర సృష్టించింది. చిత్తూరులోని డాక్టర్ రామలక్ష్మీ ఫర్టిలిటీ సెంటర్ ఇందుకు వేదిక అయ్యింది. చిత్తూరు చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఐవిఎఫ్ శిశువు(టెస్ట్ ట్యూబ్ బేబీ) జన్మించడంతో టెస్ట్ ట్యూబ్ బేబీల సృష్టికి ఇక చిత్తూరు వేదిక కానుంది. డాక్టర్ రామలక్ష్మీ నర్సింగ్ హోమ్‌లో జులై 4న జరిగిన ఈ సంబర కార్యక్రమంలో డాక్టర్ సి.రోజాప్రియ, డాక్టర్ కె.రామలక్ష్మమ్మ, డాక్టర్ సి.నిరంజన్‌రెడ్డి తదితరులు పాలుపంచుకున్నారు. డాక్టర్ రోజా ప్రియ చిత్తూరులో ఐవిఎఫ్ చికిత్సను విజయవంతంగా చేపట్టి ఆనందంను అందరితో పంచుకున్నారు. చిత్తూరు మురకంబట్టుకు చెందిన సుభాషిణి, భాస్కర్ దంపతులకు గత 8 సంవత్సరాలుగా సంతానం లేదు. వీరు సంతానం కోసం పలు ఆసుపత్రులకు తిరిగి చివరికి డాక్టర్ రోజా ప్రియను డాక్టర్ రామలక్ష్మీ ఫర్టిలిటి సెంటర్‌లో సంప్రదించారు. డాక్టర్ రోజా ప్రియ ఈ దంపతులు క్షుణ్ణంగా పరీక్షించి సుభాషిణి గర్భం ధరించడానికి చికిత్స అందించారు. డాక్టర్ రోజా ప్రియ తన మొదటి ఐవిఎఫ్ కేసును సవాలుగా స్వీకరించి విజయవంతంగా పూర్తి చేశారు. సుభాషిణి దంపతులు డాక్టర్ రామలక్ష్మీ ఫర్టిలిటీ సెంటర్‌లో ఆరోగ్యకరమైన ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో 203 కేసుల పరిష్కారం

పలమనేరు,జూలై 5 ప్రభాతవార్త:



పలమనేరులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 203 కేసులు పరిష్కరించినట్లు పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆదినారాయణ తెలిపారు.స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఇరు కక్షిదారులను న్యాయవాదుల సమక్ష్యంలో రాజీ మార్గంలో కేసులను పరిష్కరించారు.ఈ మేరకు 16 సివిల్ కేసులు, 154 క్రిమినల్ కేసులు,33 బ్యాంకు కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి లిఖిత, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : ఐటిఐ ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, జులై 5 ప్రభాతవార్త :
పారిశ్రామిక శిక్షణ సంస్థ వెదురుకుప్పం ఆవరణంలో సోమవారం నిర్వహించే జాబ్‌మేళాను యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్ జి.సుబ్రమణ్యం శనివారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటిఐ పూర్తి చేసి 18 సంవత్సరాలు నిండిన ఆశక్తిగల యువతి,యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు వెదురుకుప్పం పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఆవరణంలో వివిధ ప్రముఖ కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్నాయని నిరుద్యోగ యువతి యువకులు అవకాశంను ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్స్ 9533723022, 9533394950, 9492571731 సంప్రదించాలని తెలిపారు.

## విట్నస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు

చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:
ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఈ నెల 10వ తేదీ నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో విట్నస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకుని వారితో వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద పాఠశాలల్లో వున్న మౌళిక సదుపాయాల మీద మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు, ఫోటోల అప్‌లోడ్‌లు, విట్నస్ అధికారులు ఇంత తతంగం అవసరమా! అని ప్రశ్నించారు. పిటిఎం కార్యక్రమంను డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడం తగదన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా మార్చాలని డిమాండ్ చేశారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ ప్రస్తుతం అందుకు విరుద్ధంగా బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగిస్తోందని ఆరోపించారు.

## రాజనాలబండపై శనివారం పూజలు



చౌడేపల్లి, జులై 5 ప్రభాతవార్త:
సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబండపై శనివారం విశేష పూజలు నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి నరసింహస్వామి క్షేత్ర పాలకుడు ప్రసన్న ఆంజనేయస్వామికి ఉదయాన్నే వివిధ రకాల జలాలు, పుష్పాలతో అభిషేకించి, విశేష అలంకరణ గావించాడు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. స్వామివారి మహిమలను తెలుసుకొని భక్తులు ఆయన ఎదుట మొకరిల్లారు. పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్యామ్

శ్రీరంగరాజపురం, జులై 5 ప్రభాతవార్త:



శ్రీరంగరాజపురం మండల వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొత్తపల్లిమిట్ట గ్రామంకు చెందిన కొత్తపల్లి శ్యామ్‌ను నియమించినట్లు వైకాపా అధిష్ఠానం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి, జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులకు కొత్తపల్లి శ్యామ్ కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు వేణుగోపాలస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు

చౌడేపల్లి, జులై 5 ప్రభాతవార్త:
స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 6న తొలి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు తెలిపారు. ఆషాడం తొలి ఏకాదశిన ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయనీ, భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రుల కావాలని ఆయన కోరారు.

## దిగువమాఘంలో ఘనంగా బండి మీద కుంభం

తవణంపల్లి, జులై 5 ప్రభాతవార్త:



మండలంలోని దిగువమాఘం గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం బండి మీద కుంభం, బకాసుర వధ కార్యక్రమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో 21 రోజుల పాటు జరిగే మహాభారత యజ్ఞం ధర్మకర్త ఆర్.ఉమాపతి రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడుల సహకారంతో గత నెల 27వ తేదీ ఘంగా ప్రారంభమైంది. ఈ మేరకు శనివారం బండి మీద కుంభం, బకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తడకరకు చెందిన బేరి జగన్నాథశెట్టి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా బీముడి వేషదారుడు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై దిగువమాఘం, వీర్లగుడిపల్లి, కొండ్రాజులు కాలువ, నల్లప్పరెడ్డిపల్లి, జట్టిపల్లి, మైలవారిపల్లి, జయనగర్, అమరపురి తదితర గ్రామాల్లో పర్యటించి భక్తుల నుండి అన్న ప్రసాదాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమాపతిరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## మామిడి రైతుకు సత్వర సాయం

**పెనుమూరు, జులై 5 ప్రభాతవార్త:** జిల్లాలోని మామి డి రైతులకు ప్రభుత్వం సత్వర సహాయం అందించాలని జిల్లా వైకాపా కార్యదర్శి మహాసముద్రం దయా సాగర్‌రెడ్డి అన్నారు. పెనుమూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఈ సీజన్‌లో రికార్డు స్థాయి మామిడి ఉత్పత్తి అయ్యిందన్నారు. రికార్డు స్థాయిలో మామిడి పంట ఉత్పత్తి కావడంతో ఓ వైపు సంబరపడ్డ రైతులు గిట్టుబాటు ధర లేకపోవడంతో వారి సంతోషం ఆవిరి అయ్యిందన్నారు. జిల్లాలో 75 శాతం రైతఉలు మామిడి సాగుపై ఆధారపడి వున్నారని, సిఎం జిల్లాలోనే మామిడి రైతుల పరిస్థితి ఇలా వుంటే ఇతర జిల్లాలో రైతుల పరిస్థితి ఎలాగని ఆయన ప్రశ్నించారు. మామిడి రైతుకు మద్దతు ధర కల్పించడానికి వైకాపా రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ ఈ నెల 9వ తేదీ బంగారుపాళ్యం వస్తున్నారని భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటిసీ దొరస్వామి యాదవ్, మహాసముద్రం సురేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, దూది మోహన్, కంచర్లచక్రవర్తి నాయుడు,దూదిశంకర్, గంధం ముని, లోకేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వ హామీలకు లేదు గ్యారెంటీ : మాజీ ఎమ్మెల్యే

పెద్దపంజాణి,జూలై 5,ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు గ్యారెంటీలు లేవని పలమనేరు మాజీ ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ విమర్శించారు. శనివారం మండలంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం మరచిపోయారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు అడవులు,గుట్టలు తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో వైకాపా సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పీటిసిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం సన్నిధిలో ప్రముఖులు





కాణిపాకం, జులై 5 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీ స్వయంభూ వరసిద్ధి వినాయస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి, అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, వారి కుమారుడు పరిటాల శ్రీరామ్‌లు వేరు వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేదాశ్వీచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, సూపరిటెండెంట్లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు రవి, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులకు మోక్షం కల్పించిన సిఎం

## - కుప్పానికి 9.57 కోట్లు మంజూరు...లబ్దిదారుల్లో హర్షం!

కుప్పం, జులై 5 ప్రభాతవార్త :
కుప్పం నియోజకవర్గంలో గత ఆరేళ్ల కాలంగా బకాయిలు ఉన్న హౌసింగ్ పెండింగ్ బిల్లులకు సిఎం చంద్రబాబునాయుడు మోక్షం కల్పించారు. దీంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య కుప్పం నియోజకవర్గంలో పేదలకు ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో పక్కా ఇళ్లను మంజూరు చేశారు. ఆ సమయంలో పలువురు లబ్దిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేయడం, మరికొన్ని వివిధ దశల్లో ఉండగా బిల్లుల కోసం ప్రతిపాదనలు పెట్టారు. అయితే 2019లో ఎన్నికలు రావడంతో దాదాపు ఎన్నికలకు ముందే బిల్లుల చెల్లింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. తదనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన విషయం విదితమే. అయితే పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం లబ్దిదారులు హౌసింగ్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం కన్పించలేదు.
దీంతో గృహ నిర్మాణ లబ్దిదారులు అవస్థలు పడ్డారు. ఐదేళ్ల కాలంలో ఒక్క లబ్దిదారుడికి కూడా పెండింగ్ బిల్లులు మంజూరు కాలేదు. 2024లో మరలా సిఎం చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో 2014-19 మధ్య కాలం నాటి హౌసింగ్ పెండింగ్ బిల్లుల విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
దీ ంతో అప్పటి బిల్లుల మంజూరుకు సిఎం చంద్రబాబు ఆదేశించడంతో ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను మంజూరు చేశారు. కుప్పం నియోజకవర్గానికి 9.57కోట్లను మంజూరు చేశారు.

## సిఎం చంద్రబాబుతోనే ప్రగతి



**పెనుమూరు, జులై 5 ప్రభాతవార్త:** గత ప్రభుత్వ విధ్వంస పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని, అలాంటి పరిస్థితుల్లో సిఎంగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంను ప్రగతిపథంలో నడిపిస్తున్నారని మాజీ ఎంపిపి వీరపల్లి హరిబాబునాయుడు అన్నారు. మండలంలోని సాతంబాకంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాజీ ఎంపిపి హరిబాబునాయుడు పాల్గొని ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. రాష్ట్రానికి తలమానికమైన పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై సిఎం నారా చంద్రబాబునాయుడు దృష్టి నిలిపి రాష్ట్రంను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళడానికి శ్రమిస్తున్నారన్నారు.తెలుగుదేశం నాయకులు మనోహర్‌రెడ్డి, షణ్ముగవర్మ, వడ్లముడ తులసీనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, నాగరాజు, రామకృష్ణ, పొందు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను తొలగించండి: వినియోగదారులను రక్షించండి



**శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త** విద్యుత్ వినియోగదారులను గందరగోళానికి గురి చేస్తున్న స్మార్ట్ మీటర్లను తొలగించి వినియోగదారులను రక్షించాలని స్థానిక విద్యుత్‌శాఖ ఎడి కార్యాలయం వద్ద సిపిఐ సారథ్యంలో ధర్నా నిర్వహించారు.శనివారం సిపిఐ నాయకుడు జనమాల గురవయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించి ఎడికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారుల మీద అదనపు భారం పడుతుందని ధ్వజమెత్తారు. అంతేకాక వినియోగదారులను దొడ్డిదారిని దొచుకొనుటకు వేసిన ప్రణాళికే స్మార్ట్ మీటర్లు అన్నారు.గతంలో ఆదానితో ఆ ప్రభుత్వం ఒప్పందం చేసుకొని వినియోగదారులను పరోక్షంగా తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వ నాయకులు స్మార్ట్‌మీటర్ల రద్దుకు భరోసా ఇచ్చారన్నారు. ఒక యూనిట్ కరెంటును ఒక్క రూపాయికే ఇవ్వాలని డిమాండ్ చేసారు.స్మార్ట్ మీటర్లును తొలగించకుంటే కూటమి ప్రభుత్వం మరో ఉద్యమాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని వివరించారు.ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గంలోని మండలాల్లో నాయకులు రొద్ద గోపి, మించల శివకుమార్, చారులత, మేక జనార్ధన్, మల్లియ్య,నరసయ్య,రమేష్, ముని, మస్తాన్,తమీం, మునెమ్మ, గంగమ్మ, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల గేట్ ధర్నా

శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త



ఏపియస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శనివారం శ్రీకాళహస్తిలోని యూనియన్ నాయకులు 'గేట్ ధర్నా'ను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యూనియన్ గౌరవాధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏపియస్ఆర్‌టిసి కార్మికులకు కూటమి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఉద్యోగుల పదోన్నతులు ప్రకటించాలని పిఆర్‌సికి సంబంధించి కమిటిని నియమించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకు పది వేల మంది సిబ్బంది కావాల్సి ఉంటుందన్నారు. ఈ ఆందోళనా కార్యక్రమాల్లో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నరసింహు లు,డిపో వర్కింగ్ అధ్యక్షులు ఎస్ ఆర్ కుమార్,డిపో కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసకుమార్సి, సి.రావు,ఎస్.కుప్పయ్య, టి.ఎల్ మూర్తి, పిఎస్ ప్రసాద్ కె,యస్ కుమార్,పి,గోపి ఎం, గురునాధం, ఎస్‌జి,చంద్ర,కె.ఆర్ కృష్ణ, బి.ఈశ్వరయ్య, పి.పట్టాభి, గురవమ్మ, భవాని, ఉష,గాయరేజ్ అధ్యక్షులు మురళి,కార్యదర్శి రోశయ్యల పర్యవేక్షణలో ఆందోళన చేసి డిపో మేనేజర్ కు వినతి పత్రం అందించారు.

## శివయ్య సేవలో రిటైర్డ్ జడ్జి



**శ్రీకాళహస్తి,జూలై 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం హైకోర్టురిటైర్డ్ జడ్జి ఎం.సత్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఎఇఓ మోహన్,పిఆర్ఓ రవి సారధ్యంలో దక్షిణ గోపురం వద్ద మేళ తాళాలు,మంగళవాయిద్యాలు,వేదపండితుల వేదప్రవచనాలతో స్వాగతం పలికారు.ఆలయంలోని జ్ఞాన ప్రసూనాంబసమేత వాయులింగేశ్వరుని అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలుఅందించారు.భద్రతను ఎస్ఓ నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.

## మహారాష్ట్ర తెలుగు పాఠ్యాంశాల్లో 'బాలు' గేయానికి చోటు



**తొట్టంబేడు,జూలై5 ప్రభాతవార్త** మహారాష్ట్ర తెలుగుపాఠ్యాంశాల్లో తొట్టంబేడు మండలానికి చెందిన ఉపాధ్యాయుని గేయానికి అవకాశం లభించింది. ఈ మేరకు శనివారం సమాచారం అందింది.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పని చేస్తున్న కమ్మూరి బాలసుబ్రమణ్యం వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు.కానీ కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న ఆయనకు ఎన్నో అవార్డులు అందాయి.ఈ నేపధ్యంలో ఆయన రాసిన గేయాన్ని మహారాష్ట్ర తెలుగు పాఠ్యాంశాల్లో అవకాశం కల్పించింది. ఆయన ఈ ఏడాది ఒకటవ తరగతి బాల భారతి తెలుగువాచకంలో రాసినసీతాకోక చిలుక గేయాన్ని పాఠ్యాంశాలలో చేర్చింది బాలు మాట్లాడుతూ తాను రాసిన గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థులకు పరిచయం చేస్తూ పాఠ్యాంశంగా తీసుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

## జాతీయ లోక్ అదాలత్ లో 67 కేసులు పరిష్కారం

కుప్పం, జులై 5 ప్రభాతవార్త
కుప్పం కోర్టు ఆవరణలో శనివారం చిత్తూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 67 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు .ఈ కేసులకు సంబంధించి రెండు లక్షల 67 వేల రూపాయలు బాధితులకు పరిహారం చెల్లించేలా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప ,సెక్రటరీ ఉదయ్ కుమార్ ,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశాంతి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య జులై 5 ప్రభాత వార్త



రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు బ్రోచర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వై.ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర నల్ల మూల నుండి దాదాపు 300 మంది బాడీ బిల్డర్స్ ఈ పోటీలలో పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ లో బాడీ బిల్డింగ్ అభివృద్ధికి తన వంతు సహాకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీ నుంచి జరిగే ఈ పోటీలకు తన వంతు సహాయంగా 55 వేల రూపాయలు స్పాన్సర్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పోటీలు నిర్వహిస్తున్నది కడప జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్,ప్రకాశం డిస్ట్రిక్ బాడీ బిల్డర్ అసోసియేషన్ లకు శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

## నేడు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

తిరుపతి విద్య, జులై 5 ప్రభాతవార్త

ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవ సందర్భంగా పెంపుడు శునకాలకు, పిల్లులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఒక ప్రటనలో తెలిపారు. వెటర్నరీ కళాశాల పశువైద్యశాలలో,పట్టణంలోని తాతాయ్యగుంట పశువైద్య శాలలోనూ ఆదివారం 9గంటల నుంచి ఉచిత టీకాలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. పెంపుడు శునకాలు,పిల్లులు కలిగిన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్థానికుల సమస్యలు పరిష్కరించండి. ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య, జులై 5 ప్రభాతవార్త



తిరుమలలోని స్థానికుల సమస్యలు పరిష్కరించాలని టిటిడి ఈఓ శ్యామల రావును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శనివారం సాయంత్రం పద్మావతి అతిథి గృహంలో ఈఓ శ్యామల రావు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల భేటి అయ్యి వివిధ సమస్యలపై చర్చించారు. ఆర్బీ సెంటర్ లో నివాసం ఉంటున్న 84 మంది స్థానికులకు తిరుమలలోనే నివాస సౌకర్యం కల్పించాలని ఈఓను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. అలాగే బాలాజీ నగర్ లోని ఇళ్ళకు స్లాబ్ లు వేయించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. కాగా తిరపతి నగరంలోని ఏడు రోడ్ల నిర్వహణను టిటిడి పునరుద్ధరించడంతో పాటు పారిశుద్ధకార్మికులను నియమించాలని ఎమ్మెల్యే ఈఓను కోరారు. కాగా స్విమ్స్, మెటర్నటీ హాస్పిటల్, బర్డ్,రుయా ఆస్పత్రుల వ్యర్థాలు భూమిలో ఇంకి పోవడంతో మంచినీళ్ళగుంట కలుషితమైందని ఈఓ దృష్టికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,కార్పోరేటర్లు నరసింహాచ్చారి, నరేంద్రాలు తీసుకెళ్ళారు. ఆస్పత్రులకు యూడిజి ఏర్పాటు చేసి కార్పొరేషన్ డ్రైయిన్ లలో కలిసేలా చూడటంతో పాటు మంచినీళ్ళగుంట నిర్వహణను టిటిడి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మోడల్ స్కూలు వద్దు...మా బడే మాకు ముద్దు

సత్యవేడు, జులై 5 ప్రభాతవార్త:



మోడల్ స్కూలు ముసుగులో పేద పిల్లలకు విద్యను దూరం చేయొద్దని సత్యవేడు సీపీఎం మండల కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద తరగతుల విలీనాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పేరడం పాఠశాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు పలువురు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పేరడం గ్రామంలో ప్రాథమిక పాఠశాల కొన్ని ఏళ్లుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం మోడల్ స్కూలు పేరుతో 3,4,5 తరగతులను వేరే స్కూలులో విలీనం చేసిందన్నారు. ఇందులో భాగంగానే పేరడం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను సమీప మదనంబేడు పాఠశాలలో విలీనం చేశారన్నారు. అయితే పిల్లలు ప్రధాన రోడ్డు మార్గం ద్వారా దాదాపు రెండు కి.మీ దూరంలోని పాఠశాలకు వెళ్లి తిరిగి రావాల్సి ఉందన్నారు. దీనిపై ఇప్పటికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టినట్టు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణయ్య, వీరమ్మ, సుశీల, మునెమ్మ, లక్ష్మి, సెల్వం, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌రెడ్డికి టీడీపీ నాయకులు ఘన సన్మానం

సత్యవేడు, జులై 5 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్తగా నియమితులైన కూరపాటి శంకర్‌రెడ్డిని పలువురు టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. తిరుపతిలో శంకర్‌రెడ్డి స్వగృహంలో సత్యవేడు టీడీపీ నేతలు మురళి(చికెన్ చిన్న), ఎంపీటీసీ బాలసుందరం రెడ్డి, మండల రేషన్ డీలర్స్ సంఘం అధ్యక్షులు సునీల్ జైన్, శంకరయ్య, నారాయణ, గుణ, మల్లి, సుధాకర్ తదితరులు కూరపాటి శంకర్‌రెడ్డిని కలిసి ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు.

## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు

తొమ్మిది ట్రాక్టర్లు సీజ్....

రేణిగుంట జులై 5 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులమండ్యం పంచాయితీ సర్వే నంబర్ 316/16/2 నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీఆర్వో విశ్వనాథయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను సీట్ చేసి కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖతో సమన్వయం ఏర్పరచుకొని ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారి సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు

## మత సామరస్యానికి ప్రతీక మొహరం



శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో మొహరం పండగను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఇస్లాం మతంలో మొదటి నెల మొహరం అని వివరించారు. గతంలో భారీ ఎత్తున జరిగే మొహరం లో పీర్లను ఊరేగించటం జరిగేది. అయితే మారుతున్న వాతావరణం, దివ్యఖుర్ ఆన్‌లోని అంశాలను మత పెద్దలు వివరిస్తూ ఈ రోజులు మనం సంబరాలు జరుపుకునేది కాదని సంతాప దినాలని ఇస్లాం మతం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగావదలి పెట్టిన ప్రవక్తల జీవితాలని వివరిస్తూ చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఈ నేపధ్యంలో నేడు పీర్లపండగను సంతాప దినాలుగా ఆచరిస్తున్నారు. ఆదివారం షహదత్ నిర్వహించనున్నారు. పట్టణంలోని దర్గా మిట్ట, పాత నెల్లూరు బస్టాండ్ జయరామారావు వీధిలో కొన్ని ప్రాంతాల్లో పీర్లను ఏర్పాటు చేసి పండగను నిర్వహిస్తున్నారు. దర్గా మిట్టలో కార్యక్రమాల్లో సయ్యద్ అహ్మద్,బాబాఫరీద్,జులేషా, సయ్యద్ షా,నాగేశ్వరరావు,రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల ఉత్సవాలు: ట్రాఫిక్ మళ్ళింపు:

**తొట్టంబేడు,జులై 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఒక్క రోజు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు డివైయస్‌పి నరసింహమూర్తి, టూ టౌన్ సిఐ నాగార్జున్ రెడ్డి శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. ఆదివారం అగ్నిగుండం సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద పలు భక్తి భావంతో కూడిన కార్యక్రమాలు,చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉదయం ఆలయం వద్ద పొంగళ్ళు పెట్టడానికి మహిళలు విశేష సంఖ్యలో హాజరౌతారు కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను మళ్ళిస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎటువంటి వాహనాలను అనుమతించబడదన్నారు. ఎంజిఎం సర్కిల్ నుంచి, విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద నుంచి ట్రాఫిక్‌ను మళ్ళి స్తున్నట్లు వివరించారు. పిచ్చాటూరు మార్గం నుంచి వచ్చే అన్ని బస్సులు,కార్లు, లారీలు డిగ్రీ కళాశాల వరకే అనుమతిస్తామన్నారు. అక్కడ నుంచి యూటర్న్ తీసుకొని వెనక్కు వెళ్ళాలని సూచించారు. పట్టణంలోకి వెళ్ళాల్సి న ద్విచక్రవాహన చోదకులు,ఆటోలు,కార్లు ఆర్‌సిపి స్కూల్ నుంచి చిలకావారి కండ్రిగ,ఎంజిఎం ఆసుపత్రి మీదుగా బైపాస్ వెళ్ళి పట్టణంలోకి వెళ్ళవచ్చునన్నారు. పిచ్చాటూరు వెళ్ళాల్సి న వారు సన్నిదివీధి నుంచి వేడాం, రామాపురం డ్యాం మీద నుంచి వెళ్ళాలని సూచించారు. ఆర్‌టిసి బస్సులు చెన్నై,నెల్లూరులకు వెళ్ళాల్సి న బస్సులు ఎస్‌డికె నగర్ నుంచి మీని బైపాస్‌కు చేరుకోవాలన్నారు. తిరుపతి వెళ్ళే వాహనాలుకూడా బైపాస్‌మీదుగా సాగాలని సూచించారు.

## సాయి నాథుడి ఆశీస్సులకు తరలిరండి..!

మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి

***చంద్రగిరి, జులై 5 ప్రభాతవార్త:*** స్థానిక పాతపేటలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలకు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందగలరని మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి భక్తులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు వెళ్ళడించారు. ఈ నెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం, గురువారం రెండు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెళ్ళడించారు. 10వతేదీనమధ్యాహ్నంఅన్నదానం,రాత్రిసాయినాధుడిగ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని విరివిగా విరాళాలు అందించాలని కోరారు.

## తోటల పెంపకంలో రైతులకు అవగాహన అవసరం

***రామచంద్రాపురం, జులై 5 ప్రభాతవార్త:***



ఉద్యానవన తోటల పెంపకంలో రైతులకు అవగాహన అవసరమని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం (విజయవాడ) అధికారి వీరయ్య చౌదరి అన్నారు. శనివారం రామచంద్రాపురం, నడవలూరు, గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగ గ్రామాలలోని రైతులతో ఆయన ముఖాముఖి చర్చించారు. తోటల నిర్వహణపై రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండు ఈగలతో తీవ్రంగా పంట నష్టపోతున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. పంటలు నష్టపోకుండా ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన సలహాలు, సూచనలు పాటించి కాయ నాణ్యతను పెంపొందించుకోవాలన్నారు. పండు ఈగల నివారణకు బుట్టలు కట్టడం, కాయకు కవర్లుచుట్టడం వంటివి చేయాలన్నారు. కోతల అనంతరం రైతులు సమగ్ర యాజమాన్య పద్దతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి శివకుమారి, విహెచ్ఓ పూజిత, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకునేది కూటమి ప్రభుత్వమే

– ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



**వడమాలపేట, జులై 5 ప్రభాతవార్త:** మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటున్నది కూటమి ప్రభుత్వమేనని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం వడమాలపేట మండలంలోని తిరుమణ్యం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ ఒక్క ఏడాది కూడా మామిడి రైతులకు గిట్టుబాటు ధర గురించి ప్రస్తావించలేదని నేడు కావాలనే మామిడి రైతుల కోసం శ్రమిస్తున్నట్లు బిల్డప్ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకుంటుందని గుర్తు చేశారు. గత పాలనలో వైసీపీ నాయకులే సిండికేట్లుగా ఏర్పడి మామిడి రైతులను ముంచారన్నారు. గుంతల మయంగా ఉన్న తిరుమణ్యం–ఎనమలపాళెం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి భూమిపూజ తిరుమణ్యం నుంచి ఎనమలపాళెం వరకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. 77 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నా బార్డు నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, ఏవో హరినాథ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ మణిరాజు, ధనంజయలునాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటయ్య, హేమావతి, బాబుసాహెబ్, శ్రీనివాసులు, జ్యోతిరెడ్డి, రఘు, వివేక్, వేణు, వెంకటేశ్వరరావు, ఉమాపతి రావు, రాధాకృష్ణ, పెద్దబ్బరాజు, మునిరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారికి మాంగల్య పూజలు

పుత్తూరు రూరల్, జులై 5 ప్రభాతవార్త:



పుత్తూరు సమీపంలో ఉన్న పరమేశ్వర మంగళం నగరి మధ్యలో శ్రీ దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో జరుగుతున్న నవరాత్రులు ఆషాడ గుప్త నవరాత్రి మహోత్సవం సందర్భంగా ఉదయం 9 నుంచి వారాహి విశేష అలంకరణతో బాల పూజ, కన్యపూజ, మాంగల్య పూజ, హోమాలతో విజయవంతంగా నిర్వహించి 500 మందికి అన్నదాన కార్యక్రమం చైర్మన్ మోహనమ్మ నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకటేశ్వరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ముందుగానే పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాంగల్య పూజలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి విలువైన పట్టు చీరలు 150మంది సుమంగళి పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమం 10 రోజుల పాటు రుతుపవన్, హోమ అలంకరణ, దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతంగా అమ్మవారి మాంగల్య పూజ అందరికి అందే విధంగా పూజారి రుతు పవన్ తెలియపరచారు.

## సమస్యల పరిష్కారానికి డిమాండ్

**పుత్తూరు రూరల్, జులై 5 ప్రభాతవార్త:**



ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపోలో ఏపీపీటీడీ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలోజరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గ్యారేజీ, డిపో నాయకులు, జిల్లా స్థాయి యూనియన్ ప్రతినిధులు ఈ మీటింగ్‌లో పాల్గొని సమస్యలపై ప్రసంగించారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగుల అభ్యర్థనలపై స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చలపతి, శ్రీనివాసులు, చంద్ర, మురళి, వేణు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## పుత్తూరులో రక్తదానం

పుత్తూరు రూరల్, జులై 5 ప్రభాతవార్త:



అఖిలభారత ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం 75వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పుత్తూరు ఎల్ఐసీ కార్యాలయంలో స్విమ్స్ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకే ఎంఆర్ కాలేజీ, శ్రీ సాయి కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో స్విమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి శ్రీధర్, ఎల్‌సీ ఉద్యోగి వెంకటముని, సిద్ధార్థ కాలేజీ లెక్చర్లు సురేష్, ఎంఆర్ కాలేజీ అధ్యాపకులు అరవింద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దస్తగిరి, సెక్రటరీ లక్ష్మణ్‌కుమార్, ఇతర యూనియన్ నాయకులు, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

## పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి - సీపీఐ

పుత్తూరు రూరల్, జులై 5 ప్రభాతవార్త:

రాష్ట్ర సమితి పిలుపు మేరకు పుత్తూరు విద్యుత్ కార్యాలయం టెక్నికల్ ఏఈ నాగప్రసాద్‌కి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15.485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. ఈ సందర్భంగా సీపీఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ అంతేగాక గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు మోదీ ప్రభుత్వ విధానాలను తీసుకొస్తున్నది. కూటమి ప్రభుత్వంఎన్నికల వాగ్దానాలను మరచి విద్యుత్ చార్జీల భారాలను మోపడం ప్రజలను మోసగించడమే అని తెలిపారు. స్మార్ట్ మీటర్లఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగులగొట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతోజరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో సీపీఐ మండలనాయకులు కృష్ణారెడ్డి, రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## జూలై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి - సీఐటీయూ

పుత్తూరు రూరల్, జులై 5 ప్రభాతవార్త:



జూలై 9న సార్వత్రికసమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మునిరాజా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడో సారి అధికారానికి వచ్చి కార్మికులను కడుపు కొట్టి చట్టాలను తీసుకురావడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, కాంట్రాక్టు అసోసియేషన్ అందరు పాల్గొని ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, దేవారెడ్డి, ధన, నందయ్య, నాగభూషణం, ముని కుమారి, విజయకుమారి, అంబికా, పద్మజ, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ లోక్ అదాలత్ ద్వారా రూ.1,24,79,075 సెటిల్డ్

**పాకాల, జులై 5, ప్రభాతవార్త** పాకాల మండలం స్థానిక కోర్టు నందు పి.పూర్ణిమా దేవి, జూనియర్ సివిల్ జడ్జి కమ్‌చైర్ పర్సన్ ఆధ్వర్యంలో సభ్యుడు జి. చంద్ర మోహన్, అడ్వకేట్ సమక్షంలో పాల్గొన్నవారు: జి.గురుస్వామి నాయుడు, జి.చంద్ర మోహన్, డి.సుబ్రమణ్యం రెడ్డి, బి.సి.రెడ్డప్ప నాయుడు, జే.ఎం. గౌరీశంకర్ రాజు, ఎన్.మధుసూదన్ రెడ్డి, ఏ.పి.పి సునీల్ పోలీసు అధికారులు పాకాల సిఐ, కల్లూరు సిఐ పాల్గొని నేషనల్ లోక్ ఆధాలత్ నిర్వహించారు. లోక్ ఆధాలత్‌లో ఉన్న మొత్తం క్రిమినల్, సివిల్, చిన్న కేటగిరీ బ్యాంక్ కేటగిరీలో ఉన్న మొత్తం 75 కేసులను శనివారం పరిష్కరించారు. ఈ కేసులకు గాను సెటిల్డ్ అయినా అమోంటు రూ.1,24,79,075 ఒక కోటి ఇరవై నాలుగు లక్షల డెబ్బై తొమ్మిదివేల డెబ్బై ఐదు రూపాయలు సెటిల్డ్ చేసామని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఉమ్మడి మంగళం పంచాయతీలలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

– పేదలను ఆదుకునేందుకే పి4 విధానం : ఎమ్మెల్యే పులివర్తి నాని



***తిరుపతిరూరల్, జులై 5 ప్రభాతవార్త:*** చంద్రగిరి నియోజకవర్గాన్ని పార్టీలకు అతీతంగా, ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. 'సుపరిపాలనలో తొలిరోజు' 4వరోజు కార్యక్రమాన్ని ఉమ్మడి మంగళం పంచాయతీలలో చేపట్టారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. రామచంద్రనగర్‌లో రేషన్ పంఫిణిలో సమస్య ఉందని, అసంపూర్తిగా ఉన్న గుడిని పూర్తి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. చెన్నయగుంట చెరువును అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకునేందుకే పి4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు ఈశ్వరయ్య, గోఫి పాల్గొన్నారు.

## జూలై 9న జరగబోయే సమ్మెను జయప్రదం చేయండి

పాకాల, జులై 5, ప్రభాతవార్త



పాకాల మండల కేంద్ర పరిధిలో జూలై 9న జరిగే కార్మిక సమ్మెలో ఆటో కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటి జిల్లా కమిటీ సభ్యులు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు ఆటో కార్మిక సమావేశం జరిగింది. సమావేశానికి ఆటో వర్కర్స్ యూనియన్ మండల నాయకులు ఆనంద్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులపై వివిధ రూపాల్లో క్రిమినల్ చట్టాలు వివిధ రకాల టాక్సు ఆటో కార్మికులపై మోపరాదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం దేశవ్యాప్త కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాల సమ్మెలో పాల్గొంటున్న సందర్భంగా ఆటో సంఘం నాయకులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు. దేవేంద్ర. రాజు. చినబాబు. శేఖర్. రాజేష్. మురగయ్య. ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించండి

సత్యవేడు, జులై 5 ప్రభాతవార్త:



అర్హులైన ఆర్టీసీ ఉద్యోగులందరికి పదోన్నతులు కల్పించాలని సత్యవేడు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ మధుబాబు కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ గ్యారేజీ వద్ద పలువురు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి మధుబాబు మాట్లాడుతూ పదోన్నతులకు సంబంధించి ముఖ్యమంత్రి పెద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు క్లియరెన్స్ ఇచ్చి అర్హులైన ఉద్యోగులు 3 వేల మందికి న్యాయం చేయాలన్నారు. మహిళలు ఉచిత బస్సు పథకం విజయవంతంగా కొనసాగాలంటే కొత్తగా 2500 బస్సులు కొనుగోలుచేసి అందుకు తగ్గట్టు సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఉన్నత సలహాదారి వెంకటయ్య, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు శూనస్వామి, రాజా, కోశాధికారి కార్తీక్, డిపో నాయకులు గోవర్ధన్, శేఖర్, శేఖర్, వెంకటయ్య, శ్రీనివాసులు, శంకర్, సరిత పాల్గొన్నారు.

## నగరసంకీర్తనంతో ఆధ్యాత్మిక వేడుక

తిరుపతి(రవాణ),జులై 5ప్రభాతవార్త



వేకువజామున గోవిందుని నామస్మరణ చేసినా, గోవింద సంకీర్తనలు విన్నా సర్వపాపహరణమవు తుం దని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీ నాధరెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికరాజధాని తిరుపతి నగరంలో మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకురా వాలన్న సంకల్పంతో భజనమండలి కళాకారులు శ్రీనివాసునికి ఎంతో ప్రీతికరమైన శనివారం రోజున నగరసంకీర్తన చేస్తూ నగరానికి ఆధ్యాత్మికశోభ చేకూరుస్తున్నారన్నారు. అందులో భాగంగా నేటి శనివారం ఉదయం సాంప్రదాయదుస్తులతో వాయిద్య, భజన సంగీత కళాకారులు గోవింద నామ సంకీర్తనలు ఆలపించారు. వీరితో స్థానిక ప్రజలు,భక్తులు జతకలిశారు. గోవిందనామాలు జపించిన గోవిందసంకీర్తనలు విన్న సర్వపాపాలు హరించి శుభాలు కలుగుతాయని రాయలసీమరంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి అన్నారు. నగరసంకీర్తనలో భాగంగా మాఢవీధుల్లో గోవింద భజనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, గుండాల గోపీనాథ్, రాజశేఖర్‌రెడ్డి,మునినాథరెడ్డి, వాసుదేవరెడ్డి, విక్రమ్‌స్వామి, సురేంద్రరాజు,నరసింహారెడ్డి, కృష్ణమూర్తిఎడ్డి, కవిత, యశస్విని, పద్మావతి, అరుణ,సిద్దమ్మ ,కళావతి, కల్యాణి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు. నగర సంకీర్తనలో సభ్యుడు సుబ్రమణ్యంను సన్మానించార

## పేకాట రాయుళ్ళ అరెస్టు

**కేవీబీ పురం, జులై 5 ప్రభాతవార్త:** మండలంలోని సూరమాలలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సూరమాలలో పేకాట నిర్వహిస్తున్నారని పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో పాటు పిచ్చాటూరు స్పెషల్ ఫోర్స్, పోలీసు సిబ్బందితో కలసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 21950 రూపాయలతో పాటు 9 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

## తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

**కేవీబీ పురం, జులై 5 ప్రభాతవార్త:** తేనె టీగల దాడిలో 20 మంది ఉపాధి కూలీలు గాయపడిన ఘటన మండలంలోని వగ్గూరు గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన 20 మంది కూలీలు గ్రామంసమీపంలో కరువు పనులు చేస్తుండగా వారిపై తేనె టీగలు ఒక్క సారిగా దాడి చేసి గాయపరచాయి. గాయపడిన వారిని కేవీబీ పురం పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మాలతి, ఏపీవో భాస్కరయ్యలు పరామర్శించారు. అవసరమైతే మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని ఏపీవో, వైద్యులకు సూచించారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కేవీబీ పురం వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో తెలిపారు.

## కార్వేటినగరంలో దుశ్శాసన-దుర్యోధన సంహారము

కార్వేటినగరం,జులై 5 ప్రభాతవార్త:



శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజైన శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దుశ్శాసన–దుర్యోధన సంహారం ఘట్టం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఐదు అడుగుల ఎత్తు,ముప్పై అడుగుల పొడవుతో దుర్యోధన,దుశ్శాసన ప్రతిమలను బంకమట్టితో తయారు చేసి అలంకరించారు. దుర్యోధన–దుశ్శాసన సంహార ప్రాంగణానికి పోతురాజు, అర్జునుడు, నకుల, సహదేవ స్వామి వార్లను అలంకరించి తీసుకురావడం జరిగింది. ద్రౌపదిదేవికి సభలో అవమానం జరిగిందని భీముడు దుశ్శాసన,దుర్యోధనలను సంహరించాడు. ఈ ఘట్టాన్ని ప్రజలకు నాటక రూపంలో కనులకు విందుగా ప్రదర్శించారు. ఉభయదారులైన తూర్పువీధివారు స్వామివారిని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. 2003సం॥ 10వ తరగతి స్కూల్‌బ్యాచ్ వారిచే రాత్రి గొప్ప అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయఅధ్యక్షులు మేళం రవియాదవ్,ప్రధానకార్యదర్శి బి.గౌతమ్ రాజు,ఉపాధ్యక్షులు కె.రవిరెడ్డి,కోశాధికారికె.లక్ష్మీపతి,ఉపకోశాధికారిఆర్.సాయిరాయల్,భక్తులు పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై సవ్యసాచి దర్శనం

శ్రీకాళహస్తి,జులై 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఆవరణలో ఉత్తర గోగ్రహణం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి సవ్యసాచి పసిడి ఆశ్వవాహనంపై దర్శన మిచ్చారు. పట్టణంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి గోవుల్ని ఇక్కడకు తరలించారు. సంప్రదాయ బద్ధంగా గోగ్రహణంను అర్జునవేష ధారి నిర్వహించారు. ఆవుల్ని మలవేసిన అర్జునుని అశ్వవాహనంపై ప్రతిష్ఠించి కన్నుల పండువగా పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రవి పర్యవేక్షణలో ఉత్సవాల ఊరేగింపు ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్ సాయి వారి సిబ్బంది పర్యవేక్షణలో ఊరేగింపు జరిగింది. ఆలయ అర్చకులు తులసి స్వామి వారికి హారతులిస్తూ ముందుకు సాగారు. ఇంటింటి వద్ద స్వామి వారికి హారతులిచ్చారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు హాజరయ్యారు. ఊరేగింపుతో పాటు ట్రాఫిక్‌కు చెందిన సిబ్బంది చక్కగా నిర్వహించారు.

# గూడూరు డివిజన్

## ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ అభివృద్ధి : ఎమ్మెల్యే




సూళ్లూరుపేట, జులై 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజక వర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆమె కోరారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపీనాథరెడ్డి, ఎంపిడిఓ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 9న మండల సర్వసభ్య సమావేశం

కోట, జులై 5 ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీన కోట మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి దాసరి అంజమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ చెప్పారు. ఆ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ, సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, వ్యవసాయశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పశువైద్యశాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా, విద్యాశాఖ, విద్యుత్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ, పౌరసరఫరాలు, అటవీ శాఖ, ఎక్సైజ్, మత్స్యశాఖ, రోడ్డు రవాణా సంస్థలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు.

## శ్రీచెంగాళమ్మ హుండీ ఆదాయం 61 లక్షల 71 వేలు



సూళ్లూరుపేట, జులై 5 ప్రభాతవార్త: శ్రీచెంగాళ మాతా పరమేశ్వరిదేవీ ఆలయం లోని హుండీలను శనివారం లెక్కించారు. 103 రోజులకు గాను 61 లక్షల 71 వేల 477 రూపాయల నగదు హుండీల ద్వారా ఆదాయంగా లభించింది. హుండీల్లో బంగారం 35 గ్రాములు, వెండి 130 గ్రాములు, విదేశీ కరెన్సీకి సంబంధించి యుఎస్ఏ డాలర్లు 10, సింగపూర్ డాలర్లు 5, మలేషియా రింగెట్లు 10, సౌదీ రియాల్స్ 1, యూరోస్ 5 చొప్పున ఆదాయంగా చేకూరింది. దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి కె.నవీన్‌కుమార్ పర్యవేక్షణలో సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి సమక్షంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది.

## గోడౌన్ ప్రహరీ నిర్మించుటకు నిధులు కేటాయించండి

### -ఎమ్మెల్యేకు చిల్లకూరు పిఏపిఎస్ సిఈఓ వినతి



గూడూరు, జులై 5 ప్రభాతవార్త: ధాన్యం నిల్వ చేసే గోడౌన్ ప్రహరీ గోడ నిర్మించుటకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు చిల్లకూరు పిఏపిఎస్ సిఈఓ రామా నాయుడు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా చిల్లకూరు పిఏపిఎస్ సిఈఓ రామానాయుడు మాట్లాడుతూ తమ సంఘానికి ప్రభుత్వం వారు ఉడతావారిపాలెం గ్రామ పరిధిలోని అంకుల పాటూరు గ్రామంలో సర్వే నెం. 1086లో ఎకరా 1 విస్తీర్ణం గల భూమి రైతుల యొక్క ధాన్యము నిల్వచేసుకునేందుకు, ధాన్యం ఆరబెట్టుటకు అందజేసారు. అందులో ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ను నాబార్డ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నెల్లూరు వారి రుణాల ద్వారా రూ. 40తో నిర్మించామన్నారు. కొంత భూమిలోని జంగిర క్లియర్ చేయుటకు, గ్రావెల్ తోలుటకు సంఘం వద్ద నిధులు లేనందున వారి యొక్క గ్రాంట్ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతి ఇచ్చిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, పిఏసిఎస్ అధికారులు రాజనేనీ రామానాయుడు, రాధాకృష్ణయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, జులై 5 ప్రభాతవార్త: గత వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం 11 వార్డు రాణి పేటలో ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అరాచకాలు అవినీతితోనే వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలన జరిగిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నిటిని ప్రభుత్వం నెరవేర్చినట్లు చెప్పారు. ఆగస్టు నెల 15వ తేదీ నుండి మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం కల్పిస్తుంది అని చెప్పారు. రేషన్ షాపులకు నాణ్యమైన బియ్యాన్ని ఈ ప్రభుత్వం ఇస్తుండగా గత ప్రభుత్వం పురుగుల బియ్యాన్ని ఇచ్చిందని విమర్శించారు. రాణిపేటలో స్థానికులు చెప్పిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ ఏవి రమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు శ్రీనివాసులు, ఆనంద్, నరసింహులు, రవి, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగ వైకల్య ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు

బాలాయపల్లి, జులై 5 ప్రభాతవార్త : మండలంలో అంగవైకల్యం ధ్రువీకరణ పత్రాలు కోసం సదరన్ ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. వైకల్య ధ్రువీకరణ పత్రం కావాల్సిన వారు ఈనెల ఏడో తేదీ వరకు సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. స్లాట్ బుక్ చేసుకున్నా వాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు అని తెలిపారు.

## ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి లక్ష్యం:ఎమ్మెల్యే పాశం



గూడూరు, జులై 5 ప్రభాతవార్త: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు మాత్రమేనని ఎమ్మెల్యే కుమార్ తెలియజేశారు. రామారెడ్డి పాలెంలో వారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి, 68 లక్షలతో నిర్మించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. చిల్లకూరు మండలంలోని రామారెడ్డిపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నం మునిశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాల్గొని అంకులపాటూరు ప్రాంతంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన బహుళ ప్రయోజనాల గోదామును, అలాగే ఉడతావారిపాలెం, వడ్డీ కండ్రిగ, రామారెడ్డి పాలెం గ్రామాల్లో 28 లక్షలతో ఏర్పాటై ఉన్న సిసి రోడ్లను ప్రారంభించారు. రామారెడ్డిపాలెం గిరిజన కాలనీలో తాగునీటి సమస్య ఉన్నట్లు వారు తమ దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే వారికి తాగు నీటిని అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, నాయకులు అన్నం మునిశేఖర్‌తో పాటు ఉనతాధికారులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అడుగడుగునా ట్రాఫిక్ చక్రబంధం

### -కోటలో ఆక్రమణలు తొలగించాలి-ఆక్రమణలకు గురైన కోట రోడ్డు



కోట, జులై 4 ప్రభాతవార్త: పెరుగుతున్న వాహనాలు. అందుకు అనుగుణంగా లేని సౌకర్యాలు. దశాబ్దాల క్రితం రూపకల్పన చేసిన ప్రణాళిక. విస్తరణకు నోచుకోని రోడ్డు.. వెరసి కోట పట్టణంలో నిత్యం ట్రాఫిక్ క్రమబంధంలో జనం సతమతం అవుతున్నారు. గత సంవత్సరం ఎన్నికలకు ముందు ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు వెడల్పులో భాగంగా ఒకవైపే రోడ్డు విస్తరణ చేసి మిగతా ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలు తొలగించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట పట్టణంలో రోజురోజుకు జనాభా పెరిగిపోతున్నా అందుకు తగ్గట్టుగా రోడ్ల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. వాహనాల రాకపోకలతో రోడ్ల సామర్థ్యం సరిపోవడం లేదు. కోట క్రాస్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని గత సంవత్సరం అధికారులు సర్వే సైతం నిర్వహించారు. కానీ, ఎన్నికలు సమీపించడంతో నాటి ఎమ్మెల్యే వరప్రసాదరావు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రోడ్డు ఆక్రమణల తొలగింపు కార్యక్రమానికి బ్రేక్ వేయించారు. ప్రస్తుత ఎమ్మెల్యే జోక్యం చేసుకొని కోటలో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి



గూడూరు, జులై 5 ప్రభాతవార్త : ప్రభుత్వం అనేక పేర్లతో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచిందని దీని వలన పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నపుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్లును అడ్డుకోవాలని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలను పెంచి, సామాన్య, మధ్య తరగతి ప్రజల పై భారం మోపుతున్నారు అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్ కుమార్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, రాఘవయ్య, యాకోబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ




గూడూరు, జులై 5 ప్రభాతవార్త: గూడూరులోని త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా డాక్టర్ రోహినమ్మ విచ్చేశారు. దాతలుగా నిర్మల, అమరావతి హాస్పిటల్ గూడూరు 5000 అందజేశారు. ఇంకా, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి మాధురి, కార్యదర్శి ఎస్. లక్ష్మి, స్నేహలత, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్ కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం



గూడూరు, జులై 5 ప్రభాతవార్త: రెండో పట్టణంలో ఏర్పాటై ఉన్న కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం 7వ అడిషనల్ జిల్లా జడ్జి కె.వెంకట నాగ పవన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని,లోక్ అదాలకుల ద్వారా రాజీ అయ్యే కేసులను పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి సులోచన రాణి, బార్ ప్రెసిడెంట్ ఉమాశంకర్, న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ఎస్.కె మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జులై 5 ప్రభాతవార్త: నిరుపేదలను ఆర్థికంగా పైకి తీసుకురావడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం మండల పరిషత్ కార్యాలయం వద్ద విజన్ 2047పై నియోజకవర్గస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు మంచి విజన్ ఉన్న నాయకుడు అని తెలిపారు. ఎంతోమంది పేదలు ఇబ్బంది పడుతున్నారని దాతలు ద్వారా వాళ్ళని పైకి తీసుకొచ్చేందుకు సీఎం విజన్ 2047 పెట్టినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ విజన్ 2047 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజరెడ్డి, తాసిల్దార్ నరసింహారావు, కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళిరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు విశ్వనాథం, ఆనంద్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 41 కేసులు రాజీ

కోట, జులై 5 ప్రభాతవార్త: న్యాయస్థానాల్లో కక్షిదారుల కేసులను పరిష్కరిం చేందుకు నాయుడుపేట కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 41 కేసులు రాజీ అయినట్లు పోలీసులు తెలిపారు. కోట కోర్టులో న్యాయమూర్తి లేని కారణంగా ఈ మూడు మండలాల కక్షిదారులను నాయుడుపేట కోర్టుకు తీసుకెళ్లారు.కోట మండలంలో 10కేసులు, చిట్టమూరు మండలంలో 9, వాకాడు మండలంలో 12 కేసులు, ఇతర ఏడు కేసులు రాజీ అయినట్లు పోలీసులు తెలిపారు.

## గూడూరులో వైభవంగా జగన్నాథ రథయాత్ర



గూడూరు, జులై 5 ప్రభాతవార్త: పట్టణంలో శనివారం నెల్లూరు ఇస్కాన్ బృందం ఆధ్వర్యంలో జగన్నాధ రథ యాత్ర వైభవంగా నిర్వహించారు. సొసైటీలోని నారాయ ణమ్మ గుడి వద్ద రథయాత్రను ప్రారంభిం చారు. ఈ రథ యాత్రలో ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మి, పి.ఎం రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందచేశారు.

## అదాలత్‌లో 98 కేసులు పరిష్కారం

సూళ్లూరుపేట, జులై 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో 98 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సివిల్ కేసులు మూడు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు 33, క్రిమినల్ కేసులు 62 చొప్పున పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట లోని అడ్వకేట్లు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గోవిందపల్లిలో మోహర్రం వేడుకలు

కోట,జులై 5 ప్రభాతవార్త : మండల పరిధిలోని గోవిందపల్లి, కేశవరం గ్రామాల్లో మూడవ రోజు శనివారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. మేళతాళా మధ్య ఊరెంగిపు జరిగింది.ఆయా గ్రామస్తులతో పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ముస్లీం సోదరులు మొక్కలు చెల్లించుకున్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



దొరవారిసత్రం, జులై 5 ప్రభాతవార్త : గత కొంతకాలం నుండి శ్రీహరికోట కాలనీ పునర వాసుల వివాదం శనివారం పోలీస్ స్టేషన్ కు చేరింది. స్థానికులు వివరాలు మేరకు దొరవర సత్రం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలోని 305 సర్వే నెంబర్‌లోని శ్రీహరికోట వాసులు ఇంటి స్థలాల్లోని పెన్సిగ్ రాళ్లను అక్కరపాక గ్రామానికి చెందిన కొంతమంది చోటా నాయకులు పగలగొట్టి వారి ఆస్తిని ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ధ్వంసం చేసిన వారిపై నేను చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు.

## 10న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

### - విలేకరుల సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది విద్యాశాఖ తరపున మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఏడాది సైతం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జులై 10వ తేదీన ఈ కార్యక్రమంను పక్కాగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టిందన్నారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో సర్పంచ్ నుండి ఎంపిపి, జడ్పీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియేట్ కళాశా లల్లో ఈ కార్యక్రమం నిర్వహి స్తామన్నారు. విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందిం చడానికి ఈ కార్యక్రమంను చేపడుతున్నామ న్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో సమగ్ర విద్యాభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించను న్నామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజన సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిఎస్సీ ద్వారా జిల్లాకు 1,500 నుండి 1,600 కొత్త ఉపాధ్యాయులు రానున్నారని, ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న కీలక మార్పుల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, భవిష్యత్తులో విద్యావ్యవస్థ మరింత పటిష్టం అవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతకు సన్మానం



వాకాడు, జులై 5 ప్రభాతవార్త : మండలం కొండూరు గ్రామంలో శనివారం టీడీపీ మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డిని శాలువాతో జనార్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కొండూరు గ్రామంలోని టీడీపీ నాయకులు జనార్దన్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా దువ్వూరు మాట్లాడుతూ మా నేత మధురెడ్డి 3వ సారి మండల కన్వీనర్‌గా టీడీపీ నియమించినదుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నమన్నారు. ఈ ఘన సన్మానంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి, టీడీపీ నాయకులు కార్తీక్, సుబ్బా రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంచర్ల కుటుంబానికి నారా భువనేశ్వరి పరామర్శ





కుప్పం, జులై 5 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీ ఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరమ్మ శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుటుంబీకుల్ని పరామర్శించారు. ఇటీవలే ప్రభుత్వ విప్ క ంచర్ల తండ్రి, ప్రముఖ విద్యావేత్త కంచర్ల రామయ్య శివైక్యం చెందిన విషయమే. దీంతో శనివారం కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో కంచర్ల రామయ్య ఉత్తరక్రియల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు నారా భువనమ్మ హాజరై రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కంచర్ల కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. క్రార్యక్రమాల్లో ఏపిఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, చిత్తూరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు గురుజాల జగన్మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్,రాష్ట్ర విద ్య మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కుప్పం నియోజకవర్గ తెదేపా, జనసేన, బిజెపి శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్ పర్యటన విజయవంతానికి పిలుపు

### - మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బంగారుపాళ్యం, జులై 5 ప్రభాతవార్త: మామిడి రైతులను ఆదుకోవడానికి ఈ నెల 9వ తేదీ బంగారుపాళ్యం విచ్చేస్తున్న మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, మాజీ సమితి ఉపాధ్యక్షులు తులసీ రామకృష్ణారెడ్డిలను పెద్దిరెడ్డి వారి స్వగృహాలకు వెళ్ళి పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మామిడి రైతులను భరోసా కల్పించడానికి ఎన్ని అటంకాలు వున్నా జిల్లా పర్యటనకు వైఎస్ జగన్ వస్తున్నారన్నారు. వైఎస్ జగన్ పర్యటనకు కూటమి ప్రభుత్వం అనుమతులు లేదని చెప్పున్నప్పటికీ బెంగళూరు నుండి రోడ్డు మార్గంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంకు వస్తారని పేర్కొన్నారు. గత ఐదేళ్ళ వైకాపా పాలనలో తోతాపురి రకం మామిడి సరాసరిగా కేజీ రూ.20 ధర పలికిందని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో కేవలం కేజీ ధర రూ.2 పలకడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ బంగారుపాళ్యం వస్తున్న వైఎస్ జగన్ పర్యటనకు వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, కామరాజు, హిమకర్‌రాజా, కిషోర్‌కుమార్‌రెడ్డి, దత్తురెడ్డి,ఎల్లప్పలు పాల్గొన్నారు.

## ఏడాదిలో చేయగల్గినంత చేసాం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తిరూరల్,జులై 5 ప్రభాతవార్త : కష్టాలు, నష్టాలతో అధికారం చేతికిచ్చి, అప్పులు మిగిల్చి, ప్రగల్భాలు పలికారు. అయితే ఏడాది కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ పలు మార్లు కేంద్రాన్ని అభ్యర్థించి నిధులు సాధిస్తు న్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చి దిద్దుటకు పరుగులు తీస్తున్నారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీకాళ హస్తి మండలంలోని శెనగల మిట్ట,పెనుబాక గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తు ముందుకు సాగారు. గతంలో పరిపాలించిన వారు ఎప్పుడు ఉద్యోగులకు జీతాలిస్తారో, ఎప్పుడు పెన్షన్లు ఇస్తారో తెలియదు, కానీ నేడు ఉద్యోగులకు సకాలంలో జీతాలతో పాటు పెన్షనర్లకు ఒకటవ తేదీనే తలుపు తట్టి పెన్షన్లు అందిస్తున్నామన్నారు. భారత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రరాష్ట్రంలో రూ.4వేలు వికలాంగులకు రూ.6వేలు అందిస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఎవరు ఏ సమస్యతో వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. తాము అధికారం చేపట్టిన ఏడాదిలో అవకాశం ఉన్నంత వరకు పనులు చేపట్టాము. రాబోవు 4 సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికి బంగారు భవిష్యత్తు ఉంటుందని సుధీర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రవింద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, మాజీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్,కృష్ణమనాయుడు, రమేష్ నాయుడు, జగదీశ్వరరెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అతిథిగృహం సిబ్బంది నిజాయితీ

### భక్తులు మరచిపోయిన విలువైన బంగారు నగలు అప్పగింత

తిరుమల,జులై 5ప్రభాతవార్తప్రతినిధి: అతిథిగృహం గదిలో బసచేసిన భక్తులు దర్శనానంతరం హడావిడిగా గదిని ఖాళీచేసి మరచిపోయి వెళ్లిన విలువైన బంగారు నగలను అతిదిగృహం సిబ్బంది నిజాయితీతో తిరిగి భక్తులకు అప్పగించారు. 12లక్షలు రూపాయలు విలువైన బంగారు నగలు ఉన్నట్లు భక్తులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం తిరుమల పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో ఈ సంఘటన జరిగింది. కేప్రీఅతిథిగృహంలో తమిళనాడు మధురైకి చెందిన శివ అనే భక్తుల కుటుంబం గదిని తీసుకున్నారు. శనివారం ఉదయం శ్రీవారి దర్శనానికి వెళ్ళి వచ్చారు. గదిని ఖాళీచేసే హడావిడిలో 12లక్షలు రూపాయలు బంగారు నగలను మరచిపోయారు. గదిని శుభ్రం చేయడానికి వెళ్ళిన సిబ్బంది దాన్ని గుర్తించి పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ భాస్కర్ నాయుడుకు అందజేశారు. వెంటనే ఆయన రిజిష్టర్‌లోని భక్తుల ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. భక్తులు అంతే వేగంతో అక్కడకు చేరుకుని నగలను అధికారుల సమక్షంలో అందుకున్నారు. టిటిడి సిబ్బంది నిజాయితీని భక్తులు అభినందించారు. దేవుని దయ,ఆశీస్సులతోనే పోగొట్టుకున్న నగలు తిరిగి అందుకోగలిగామని సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీశక్తి పీఠంలో భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి

### మాతాజీ రమ్యానంద భారతికి పుష్పాభిషేకం



రామచంద్రాపురం, జులై 5 ప్రభాతవార్త: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి గావించారు. ఇందులో భాగంగా శనివారం 108 రకాల విశిష్ట సుగంధపరిమళ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణల నడుమ కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి, మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఈ క్రమంలోనే మాతాజీ రమ్యానంద భారతి స్వామికి 500 కిలోల వివిధ రకాల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. పీఠానికి విచ్చేసిన భక్తులకు తీర్ధప్రసాదాలు అ ందజేశారు.

## బృహ్నల వేషంలో అర్జునుని దివ్యదర్శనం



శ్రీకాళహస్తి,జులై 5 ప్రభాతవార్త: ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం రాత్రి ఆలయంలో అర్జున తపస్సు తరువాత అర్ధరాత్రి దాటిన తరువాత అలుగు కుంభాగ్రాన నిలుపు పవిత్ర కార్యక్రమాల్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కుండపై కత్తిని నిలబెట్టడం అనేది అరుదైన కార్యక్రమాలు. రాత్రి పట్టణంలో ఊరేగింపు జరిపిన తరువాత స్థానిక పూజారులు మహిమాన్వితమైన ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. పురుషోత్తం పూజారి సారధ్యంలో అలుగు కుంభాగ్రార నిలబెట్టు ఉత్సవాన్ని జరిపారు. శనివారం ఉదయం ఉత్తర గోగ్రహణం సందర్భంగా అర్జునుడు బృహ్నల వేషంలో పట్టణంలో ఊరేగించారు.